
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం ; 17 ; ఏప్రిల్ ; 2025



పొట్టకూటి కోసం వెళితే..
మొగల్తూరు మండలంలో టాటా ఏస్ అదుపుతప్పి పంట బోదెలో బోల్తా పడడంతో.. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మృతిచెందారు. 8లో ▸



7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు
ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు మే 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 14 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. 8లో ▸



ఈదురుగాలుల బీభత్సం
ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు నేలకూలాయి. కొన్ని చోట్ల చెట్లు ఇళ్లపై పడ్డాయి. 8లో ▸

రొయ్యకు లోకల్ మార్కెట్

- స్థానిక వినియోగం పెంచే ప్రయత్నాలు
- ఏడాదిన్నర క్రితమే రొయ్యల డోర్ డెలివరీకి కార్యాచరణ
- పైలెట్ ప్రాజెక్టుగా భీమవరం ఎంపిక
- ఎన్నికలు రావడంతో నిలిచిన ప్రక్రియ
- తర్వాత పట్టించుకోని కూటమి ప్రభుత్వం



రొయ్యలు పట్టుబడి చేస్తున్న రైతులు (ఫైల్)

సాక్షి, భీమవరం: రొయ్య ధరల స్థిరీకరణకు స్థానిక వినియోగం పెంచడం మంచి పరిష్కారమని చెబుతున్నారు. ఆ దిశగా ప్రముఖులతో ప్రమోషన్ చేయించాలని, చికెన్ షాపుల్లోనూ రొయ్యల అమ్మకాలు చేయాలని ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ నిర్ణయించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సిద్ధం చేసిన లోకల్ మార్కెట్ కాన్సెప్ట్‌ను ఇప్పుడు కూటమి కమిటీ తెరపైకి తెస్తోంది. ఏడాదికి ఒక్కొక్కరు 10–12 కిలోల సగటు వినియోగంతో రొయ్యలు ఎక్కువగా తినే దేశాల్లో చైనా టాప్‌లో ఉంటే, 8–10 కిలోలతో అమెరికా రెండో స్థానంలో ఉంది. యూరోపియన్ దేశాల్లోనూ సగటున ఒక్కొక్కరు ఎనిమిది కిలోల వరకు తీసుకుంటారు. ప్రపంచ దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే మనదేశంలో మాత్రం సగటు వినియోగం 800 గ్రాములు మాత్రమే. ఆక్వా ఉత్పత్తులు, ఎగుమతుల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఏపీలో వినియోగం 1.5 కిలోలు ఉన్నట్లు ఫిషరీస్ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రంలో 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంటే అత్యధికంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే 2.63 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఏటా సుమారు మూడు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తితో జిల్లా మొదటి స్థానంలో ఉంది. టీడీపీ హయాంలో నకిలీ సీడు, ఫీడు, దళారుల దోపిడీతో కుదేలైన ఆక్వా రంగానికి గత ప్రభుత్వం కొత్త ఊపిరిలూదింది. ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారటీ (అప్సడా) ఏర్పాటు చేసి రొయ్య ధరలను లాభసాటి చేయడంతో పాటు, మేత ధరలను తగ్గించి, ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం పెంచకుండా నియంత్రించింది. నాన్ ఆక్వా జోన్ పరిధిలోని వేలాది ఎకరాలను ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి విద్యుత్ రాయితీ అందజేసింది. రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేలా చర్యలు తీసుకుంది. ఫిష్ ఆంధ్రా ద్వారా డొమెస్టిక్ వినియోగం పెంచేందుకు మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి 60 శాతం, మిగిలిన వారికి 40 శాతం రాయితీపై జిల్లా వ్యాప్తంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు విలువైన 250కు పైగా అవుట్‌లెట్లు ఏర్పాటుచేశారు. ఫోర్ వీలర్స్, టూ వీలర్స్ సబ్సిడీపై అందించారు.

రొయ్యల డోర్ డెలివరీకి కార్యాచరణ

క్వాలిటీ రొయ్యలను స్థానికంగా సామాన్య వినియోగదారుల చెంతకు చేర్చేలా రొయ్యల డోర్ డెలివరీకి ఏడాదిన్నర క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేసింది. ప్రభుత్వ సహకారంతో ఈ ప్రక్రియ అమలుకు ఏపీ రొయ్య రైతుల ఫెడరేషన్ అప్పట్లో ముందుకు వచ్చింది. ఎక్స్‌పోర్టు తరహాలో ప్రాసెస్ చేసిన రొయ్య పప్పు కిలోకు కౌంట్‌ను బట్టి రూ.600 నుంచి రూ.850 వరకు ధర నిర్ణయించారు. తొలుత జిల్లాలోని భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ నగరాలు, పట్టణాలకు విస్తరింప చేయాలని భావించారు. 2023 ఏడాది చివర్లో మత్స్యశాఖ జిల్లా అధికార వర్గాలు అందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈలోగా ఎన్నికలు హడావుడి మొదలు కావడంతో ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు.

మరుగున పడేసిన కూటమి

కూటమి ప్రభుత్వం రొయ్యల స్థానిక వినియోగం పెంచే కార్యాచరణను మరుగున పెట్టేసింది. అమెరికా ప్రతీకార సుంకాలు అమలులోకి రాకపోయినా వాటిని సాకుగా చూపించి రెండు వారాలుగా ఎగుమతిదారులు రొయ్య ధరలను కౌంట్‌కు రూ.40 నుంచి రూ.90 వరకు తగ్గించి కొనుగోలు చేస్తుండటం పట్ల రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మేత ధరలు తగ్గించాలని డిమాండ్‌చేస్తున్నారు. ఈ తరుణంలో మంగళవారం విజయవాడలో భేటీ అయిన ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ స్థానిక వినియోగం పెంచడం లక్ష్యంగా కార్యాచరణ నిర్ణయించడం గమనార్హం. రొయ్యల ప్రాముఖ్యతను వివరిస్తూ సినీ నటులు, ప్రముఖులతో ప్రమోషన్ చేయించాలని, 100, 250, 500 గ్రాములుగా ప్యాకెట్లు చేసి విక్రయించాలని, చికెన్ షాపుల్లో సైతం వీటిని అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించారు. భవిష్యత్తులో ఆ దిశగా ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వం కోవిడ్ సమయంలో సైతం రొయ్య ధరలు తగ్గకుండా రైతులకు అండగా నిలిచి మద్దతు ధర అందించింది. తర్వాతి కాలంలో ధరలు తగ్గించకుండా ఎక్స్‌పోర్టర్స్‌పై నియంత్రణ ఉంచింది. స్థానిక వినియోగం పెంచేందుకు కృషిచేసింది. అదే మాదిరి కూటమి ప్రభుత్వం స్థానిక వినియోగంతో పాటు ఎక్స్‌పోర్టర్స్‌పై ఒత్తిడి తెచ్చి రొయ్య ధరలను రైతులకు లాభసాటి చేసేందుకు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.

కొల్లేరు కేసు 12 వారాలకు వాయిదా

సీఈసీ సూచనల అమలుపై నివేదిక కోరిన ధర్మాసనం



కైకలూరు: కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలు, పర్యావరణ విఘాతం అనే అంశాలపై సుప్రీం కోర్టులో ఉన్న కొల్లేరు కేసు 12 వారాలకు వాయిదా పడింది. ద్విసభ్య ధర్మాసనం ముందు కొల్లేరు అంశంపై బుధవారం వాదనలు జరిగాయి. క్షేత్రస్థాయిలో కొల్లేరు రైతుల సమస్యలపై ఏం సలహాలు ఇచ్చారని సీఈసీని సుప్రీం ప్రశ్నించింది.. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సీఈసీ సూచనలు ఎంత మేర అమలు చేసింది.. అమలు తీరును కలెక్టర్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆఫ్ ఫారెస్టు, చీఫ్ సెక్రటరీ పరిశీలించి తమకు నివేదిక ఇవ్వాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా కొల్లేరు సమస్యపై అధ్యయనం చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సీఈసీ) కొల్లేరులో 14,000 ఎకరాలు నష్టపోయిన జీరాయితీ రైతులకు నష్టపరిహారం అందించాలని, కొల్లేరులో సంప్రదాయ వేటకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినా అవేమీ జరగలేదు. మరోవైపు కూటమి నేతలు ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి కొల్లేరు సమస్యను వివరించారు. రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్, కైకలూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు, కొల్లేరు నాయకులు బలే ఏసురాజు, కొల్లి బాబీ, రాష్ట్ర చేపల రైతుల సంఘ అధ్యక్షుడు తాడినాడ బాబు తదితరులు కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిశారు. కేంద్రం నుంచి కూడా అఫిడవిట్ వేస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు ఎమ్మెల్యే కామినేని తెలిపారు.

న్యూస్‌రీల్

25 నుంచి కొంతేరులో నాటికల పోటీలు



నాటికల పోటీల బ్రోచర్ విడుదల చేస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: యూత్ క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు కొంతేరు పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో 43వ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ అంబటి మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు తెలిపారు. స్థానిక కళామందిరంలో బుధవారం సమావేశమైన సభ్యులు నాటిక పోటీల బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంటా ముత్యాలరావు(నాయుడు), బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, అంబటి నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పెంటపాడు: ఈ నెల 30న జరగనున్న పాలిసెట్ ప్రవేశపరీక్షకు అయా పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు గూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి. ఫణీంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 90102 22178, 94901 04336 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పోలీసు సబ్ డివిజన్‌కు ఉత్తమ అవార్డు



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం యండగండి గ్రామంలో శవాన్ని పార్శిల్ చేసిన కేసును ఛేదించిన భీమవరం సబ్ డివిజన్ పోలీసులకు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్త అవార్డు అందించారు. గత డిసెంబర్ 17న కాళ్ల మండలం గాంధీనగర్‌కు చెందిన బర్రె పర్లయ్యను అదే మండలానికి చెందిన శ్రీధర్‌వర్మ హత్యచేసి పెట్టెలో పార్శిల్ చేసి యండగండి పంపించాడు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, టూటౌన్ సీఐ జి.కాళీచరణ్, ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు, భీమవరం, ఉండి, కాళ్ల, ఆచంట ఎస్సైలు ఛేదించి నిందితుడ్ని అరెస్టు చేశారు. నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికిచ్చే ఏబీసీడీ (అవార్డు ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్) అవార్డులో భీమవరం డివిజన్ ప్రథమస్థానంలో నిలిచింది.

కార్పొరేషన్ రుణం కోసం దీక్ష



దీక్ష చేస్తున్న వర ప్రసాద్

ఆకివీడు: కార్పొరేషన్ రుణాల మంజూరులో అవకతవకలు జరిగాయని, అర్హులకు రుణాలు మంజూరు చేయలేదని మండలంలోని అజ్జమూరుకు చెందిన వర్ధినీడి వరప్రసాద్ బుధవారం దీక్ష చేపట్టారు. కాపు కార్పొరేషన్ లోన్ తనకు మంజూరు చేయకుండా కొంత మందికి రికమండేషన్‌తో కేటాయించడం దారుణమన్నారు. చివరకు బ్యాంకు అధికారులు రుణం మంజూరుకు అనుమతి ఇవ్వడంతో ఆయన దీక్ష విరమించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



జిల్లా స్థాయి కమిటీ సలహా సంఘంతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

భీమవరం(ప్రకాశం చౌక్): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని, చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి జి.గీతాబాయి అన్నారు. బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కమిటీ సలహా సంఘం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు.

కూలి డబ్బుల కోసం ఎదురుచూపులు

- మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు బంద్
- రూ.13.12 కోట్ల బకాయిలు



పాలకోడేరు మండలం కొండేపూడిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

భీమవరం(ప్రకాశం చౌక్): బతుకుదెరువు కోసం ఎండలో కష్టపడి పనిచేసే ఉపాధి కూలీలకు కూలీ డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత మూడు నెలలగా ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు బకాయి పెట్టారు. కూలీ డబ్బులు కోసం నిరుపేదలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. వేతనాలు రాకపోయేసరికి అప్పులు చేసుకునే బతుకుతున్నారు. వేతనాలు ఎప్పుడు పడతాయే అధికారులకు కూడా తెలియని పరిస్థితి.

ఒక్కో కూలీకి రూ.4 వేల వరకూ బకాయి

జిల్లాలో 20 మండలాల్లో ఫిబవరి నుంచి ఇంతవరకు ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయి రూ.13.12 కోట్లకు పైగానే ఉంది. ఒక్కో ఉపాధి కూలీకి రోజుకు రూ.300 చొప్పున రూ.3 వేల నుంచి రూ.4 వేలు చెల్లించాల్సి ఉంది. మూడు నెలల దాటినా వారి ఖాతాలో వేతనాలు జమకావడం లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.కోట్ల నిధులు ఉన్నప్పటికీ వేతనాలు ఇవ్వడం లేదు. కూలీలకు వేతనాలు చెల్లించకుండా బకాయిలు మొత్తాన్ని ఈ ప్రభుత్వం ఏం చేస్తుంది.. ఆ నిధులు దేనికి మళ్లిస్తున్నారు.. ఎక్కడ ఖర్చు పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఆ నిధులు ప్రభుత్వం ఏం చేస్తుందో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలంటున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభించిన నాటి నుంచి గత ప్రభుత్వ పాలన వరకూ ఎప్పుడూ కూలీలకు ఇలా బకాయిలు పెట్టింది లేదు.

జిల్లాలో ఇలా..

ఉపాధి జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు	: 1,84,459
యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులు	: 1,2,806
మొత్తం కూలీలు	: 3.3 లక్షలు
పనికి వెళుతున్న కూలీలు	: 1.48 లక్షలు
రోజుకు కూలీ వేతనం రూ.300	

ముమ్మరంగా పనులు

జిల్లాలోని 20 మండలాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా చేయిస్తున్నారు. పంట కాలువలు, చెరువులు పూడికతీత పనులు చేయిస్తున్నారు. రోజుకు జిల్లా వ్యాప్తంగా 50 వేల మంది కూలీలు పనిచేస్తున్నారు.

ముస్లిం నేతల రిలే దీక్ష



వక్ఫ్ చట్ట సవరణకు నిరసనగా దీక్ష చేస్తున్న ముస్లింలు

కైకలూరు: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దీనిని వ్యతిరేకించాలని పలువురు ముస్లిం సోదరులు చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టం – 2025ని నిరసిస్తూ కైకలూరు పెద్ద మసీదు వద్ద ముస్లిం నాయకుడు షేక్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో ఒక రోజు రిలే దీక్షను బుధవారం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు దీక్ష సాగింది. ముస్లింల మనోభావాలు దెబ్బతీసే చట్టాన్ని రద్దు చేయడానికి చేస్తున్న నిరసనలలో ప్రజాస్వామ్య, లౌకికవాదులందరూ మద్దతుగా రావాలన్నారు. ముస్లిం నాయకులు మహమ్మద్ గాలీబ్ బాబు, షేక్ ఆరిఫ్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ అలీమ్, మహమ్మద్ రఫీ, అమీర్, షేక్ రఫీ, అబ్దుల్ హసీబా, ఫిర్దోస్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్ ,ఆసిఫ్, జహంగీర్, సుల్తాన్, భాష, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్‌కు బుకింగ్ ప్రారంభం

ఏలూరు(మెట్రో): దీపం–2 కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రక్రియలో ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు రెండో సిలిండర్‌ను బుక్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తున్నారన్నారు. మొదటి విడత 2024 నవంబర్‌లో మొదలై ఈ ఏడాది మార్చి 31తో ముగిసిందన్నారు.

కల్యాణ వైభోగమే

- జిల్లావ్యాప్తంగా వివాహ వేడుకల సందడి
- జూన్ 8 వరకు ముహూర్తాలు
- శ్రీవారి క్షేత్రంలో పెళ్లి సందడి



శ్రీవారి కొండపై మాధవ కల్యాణ మండపం

ద్వారకాతిరుమల: వేసవి వచ్చిందంటే చాలు అందరినోట పెళ్లి అనే మాటే వినిపిస్తుంది. ఎందుకంటే వివాహాలకు అత్యంత బలమైన ముహూర్తాలు చైత్రం, వైశాఖ మాసాల్లోనే ఉంటాయి. ఈ మాసాల్లో వాతావరణం అనుకూలంగా ఉంటుందని వివాహ వేడుకలు జరుపుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఇదిలా ఉంటే బుధవారం వివాహ ముహూర్తాలు ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి నెలకొంది. ఈ ముహూర్తాలు జూన్ 8 వరకు ఉన్నట్టు పురోహితులు చెబుతున్నారు. ఈ క్రమంలో ద్వారకాతిరుమల శ్రీవారి సన్నిధిలో వివాహాలు జరుపుకునే వారు కల్యాణ మండపాలు, పచ్చిపూల మండపాలు, కేటరింగ్ వంటివి బుక్ చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పురోహితులకు, బాజా భజంత్రీలకు, పెళ్లి సామగ్రికి అడ్వాన్సులు ఇస్తున్నారు. ఎవరి స్థాయికి తగ్గ ధరల్లో వారు కల్యాణ మండపాలు, పచ్చిపూల మండపాలు ఎంచుకుంటున్నారు. ఎక్కువగా పేద, మధ్యతరగతి ఆలయ అనివేటి మండపంలో పెళ్లిళ్లు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

బలమైన ముహూర్తాలు ఇవే..

వివాహ బంధంతో ఒక్కటయ్యేందుకు ఎదురు చూస్తున్న జంటలకు ఆ సమయం రానే వచ్చింది. ఈ నెల 18, 20, 21, 23, 30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అందులో 30న అక్షయ తృతీయ కావడంతో ఆ రోజు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వివాహాలు ఉన్నాయి. మే 1, 7, 8, 9, 10, 11, 14, 17, 18, 21, 22, 23, 28, జూన్ 4, 5, 6, 7, 8 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి.

అన్నీ ఫుల్

ద్వారకాతిరుమల క్షేత్రంలో ఈ నెల 22, 23, 30, మే 9న జరిగే వివాహాలకు సంబంధించి ఇప్పటికే కల్యాణ మండపాలు, రూంలు దాదాపుగా అన్నీ బుక్ అయిపోయాయి. దేవస్థానంలో కొన్ని మాత్రమే ఖాళీగా ఉన్నాయి. మిగిలిన ముహూర్తాలకు సైతం బుకింగ్‌లు ఊపందుకున్నాయి. క్షేత్రంలో పెళ్లిళ్లు జరుపుకునే వారు త్వరపడకుంటే ఇబ్బందులు తప్పవు.

వేలాదిగా వివాహాలు



మాఘ మాసం, శ్రావణ మాసాల తరువాత అధికంగా వివాహాలు జరిగేది వేసవిలోనే. ఎందుకంటే ఏప్రిల్, మే నెలల్లో వాతావరణం అనుకూలత, బలమైన ముహూర్తాలు ఉంటాయి. ఈ మాసాల్లో వివాహాలు జోరుగా జరుగుతాయి. ఈ నెల 22, 23, 30 తేదీల్లో బలమైన ముహూర్తాలు కావడంతో వేలాదిగా పెళ్లిళ్లు జరగనున్నాయి. మేలో కూడా అత్యంత బలమైన ముహూర్తాలున్నాయి.
– గోవిందవఝుల వెంకటరమణమూర్తి శర్మ, పురోహితుడు, ద్వారకాతిరుమల

పని లేదు.. నిరుద్యోగ భృతి రాదు

- వర్క్‌ఫ్రమ్ హోం సర్వేలో తేలిన లెక్కలు
- జిల్లాలో ఏ పని లేని వారి సంఖ్య 6,37,333 మంది
- జిల్లాలో 99.90 శాతం సర్వే పూర్తి



సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

ఏలూరు (మెట్రో): 'నిరుద్యోగులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పిస్తాం.. లేదంటే నిరుద్యోగ భృతిగా రు.3 వేలు అందించి అండగా నిలుస్తాం' ఇవి కూటమి సర్కారు అధికారం కోసం ఇచ్చిన అబద్ధపు వాగ్దానాలు. వాస్తవానికి కూటమి సర్కారు అధికారం చేపట్టి సంవత్సర సమీపిస్తున్నా ఉద్యోగం లేని వారిని పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం సర్వే చేస్తున్నామంటూ, సచివాలయ సిబ్బందిని ముప్పుతిప్పలు పెడుతూ కూటమి సర్కారు కాలయాపన చేస్తుంది. జిల్లాలో నిర్వహిస్తున్న వర్క్‌ఫ్రమ్ హోం సర్వేలో ఏ పనీ లేని వారి సంఖ్య 6,37,333 మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

గత రెండు నెలలుగా చేయిస్తున్న ఈ సర్వేలో మొత్తం ఎన్ని కుటుంబాలు ఉన్నాయి.? జనాభా ఎంత? ఏ పని చేయని వారు ఎంతమంది ఉన్నారు. ఇళ్ల వద్ద పనులు చేసేందుకు ఎంతమంది అనుకూలంగా ఉన్నారు? అనే అంశాలను క్రోడీకరిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 99.90 శాతం సర్వేను సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే పూర్తి చేశారు. సర్వే వివరాలను ప్రభుత్వానికి నివేదించిన అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ప్రచారం చేస్తున్నప్పటికీ ఇది ఇప్పట్లో అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రధానంగా డిగ్రీ పట్టభద్రులతోపాటు ఇంజినీరింగ్ చేసిన యువతకు శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పిస్తారని చెబుతున్నారు.

ఉన్న ఉద్యోగాలే తీసేస్తుంటే..

సర్వేలో నివాస గృహాల్లో బ్రాడ్‌బాండ్, వైఫై సదుపాయం, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉందా, లేదా అన్న వివరాలు సర్వేల్లో నమోదు చేశారు. ఇంటర్‌నెట్ సదుపాయం లేని ప్రదేశంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి ఫైబర్‌నెట్‌పైనే పర్యవేక్షణ కొరవడటంతో కొత్తగా ఇంటర్‌నెట్ సదుపాయం ఎలా కల్పిస్తారనేది ప్రశ్నార్థకమే. కనీసం ఫైబర్‌నెట్‌లో విధులు నిర్వహించే సుమారు 500 మంది ఉద్యోగాలు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరి కొత్తగా ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారనేది కూటమి సర్కారుకే తెలియాలి.

వర్క్‌ఫ్రమ్ హోం సర్వే వివరాలు

జిల్లా వ్యాప్తంగా ఇంతవరకూ చేసిన సర్వేలో 49,0034 గృహాల్ని సందర్శించారు. 10,83,839 మంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. వారిలో వివిధ పనులు చేస్తున్న వారు 1,93,819 మంది ఉన్నారు. ఏ పని చేయని వారు 6,37,333 మంది ఉన్నారు. ఇంటి వద్ద వివిధ పనులు చేస్తున్న వారు 17,341 మంది ఉన్నారు.

నిరుద్యోగులను మోసగించిన కూటమి

జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఉన్నారని, నిరుద్యోగ భృతి ఇస్తానని వాగ్దానం చేసిన సర్కారు కనీసం దీనిపై నోరు మెదపడం లేదని సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ విమర్శించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సామూహిక సీమంతం చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆరోగ్యవంతమైన బిడ్డల కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని.. క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా బుధవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 15 మంది గర్భిణిలకు సామూహిక సీమంతం నిర్వహించి, పండ్ల కిట్‌ను అందజేశారు. అనంతరం పౌష్టికాహార పక్షోత్సవ సమాచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లా వైద్య శాఖ అధికారి గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

మేలో క్రీడా శిక్షణ శిబిరాలు

ఏలూరు రూరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 1 నుంచి మే 31 వరకూ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నామని జిల్లా క్రీడ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలోని నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 50 ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. 8 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలకు నెల రోజుల పాటు శిక్షణ అందిస్తామన్నారు. ఒక్కో శిబిరంలో 25 మంది బాలికలు, మరో 25 మంది బాలురు శిక్షణ పొందేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు పూర్తి వివరాలతో ఈ నెల 19న సాయంత్రం 5 గంటల లోపు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో డీఎస్‌ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పొట్టకూటి కోసం వెళితే..

- ఉపాధి హామీ కూలీలపైకి దూసుకొచ్చిన వాహనం
- ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- నక్కావారిపాలెంలో తీవ్ర విషాదం

నరసాపురం: తోటి వ్యక్తులతో కలిసి ఉదయాన్నే పనుల్లో నిమగ్నమైన ఆ ఉపాధి కూలీల బతుకులు అనుకోని ప్రమాదంతో తెల్లారిపోయాయి. టాటా ఏస్ వాహనం రూపంలో మృత్యువు వారిని కబళించింది. ఈ హఠాత్పరిణామంతో అక్కడ పనిచేస్తున్న మిగిలిన ఉపాధి కూలీలంతా ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. ఒకరి అతివేగం రెండు నిండు ప్రాణాలను పొట్టనబెట్టుకోగా మరో ఇద్దర్ని గాయాల పాలు చేసిన ఘటన ఉపాధి కూలీల్లో తీవ్ర విషాదం నింపింది. బుధవారం మొగల్తూరు మండలంలో 216 జాతీయ రహదారి పక్కన నల్లావారితోట వద్ద అయిల్ డబ్బాల లోడుతో వేగంగా దూసుకొచ్చిన టాటా ఏస్ వాహనం అదుపుతప్పి రోడ్డుకు ఆనుకుని ఉన్న పంట బోదెలో బోల్తా పడింది. అక్కడే ఉపాధి హామీ పథకంలో పంట బోదె బాగు చేస్తున్న కూలీలు కడలి పావని (45), గుబ్బల గంగావతి (55)పై వాహనం పడటంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గంగావతి భర్త మాణిక్యాలరావు, మరో కూలీ గుడాలి సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. మాణిక్యాలరావును నరసాపురం, భీమవరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తీసుకెళ్లారు. మరో కూలీ సత్యనారాయణ తలకు బలమైన గాయం కాగా నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో



ప్రమాదానికి గురైన వాహనాన్ని బయటకు తీస్తున్న దృశ్యం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో 15 మంది కూలీలు అక్కడ పనిచేస్తున్నారు. అకస్మాత్తుగా రోడ్డుపై వెళుతున్న వాహనం తమవైపు పల్టీలు కొట్టుకుంటూ వచ్చి తోటి వారి మీదపడటంతో వారంతా భయందోళనలో పరుగులు తీశారు. వెంటనే తేరుకుని వాహనం కింద పడ్డ తోటివారిని విగత జీవులుగా చేతుల మీదుగా తీసుకుని బోరున విలపించారు. గాయపడిన వారిని నరసాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అతివేగంతోపాటు, ప్రమాద స్థలంలో ఉన్న మలుపును గుర్తించలేకపోవడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కలెక్టర్ సీహెచ్ నాగరాణి, నరసాపురం డీఎస్పీ డాక్టర్ డి.శ్రీవేద పరిశీలించారు. ప్రభుత్వ పరంగ బాధితులను ఆదుకుంటామని ప్రకటించారు. వ్యాన్ డ్రైవర్ వై.వెంకట్రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



పావని మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె, బంధువులు



గంగావతి మృతదేహం వద్ద బంధువుల రోదనలు

ఇద్దరు ఆడపిల్లలు తల్లిలేని బిడ్డలయ్యారు

ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు మహిళలది, గాయపడ్డ మరో ఇద్దరు కూలీలదీ మొగల్తూరు మండలం నక్కావారిపేట పడమటి పాలెం. ప్రమాద వార్త తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాదంలో మృతి చెందిన పావనికి ఇందుశ్రీ, ప్రవల్లిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త సత్యనారాయణ ఆటో డ్రైవర్. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. ఇంట్లో తల్లితండ్రులు ఇద్దరూ కష్టపడితేగానీ ఇద్దరు ఆడపిల్లల ఆలనాపాలనా చూసే పరిస్థితి లేదు. ఇప్పుడు ప్రమాదంలో తల్లి అకాలంగా మృత్యువాత పడింది. ఇందుశ్రీకి పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న సమయంలో దేవుడు ఇంత పనిచేశాడని బంధువులు, ఇంటిపక్కవారు బోరున విలపించడం కన్నీళ్లు తెప్పించింది. ఇక మృతురాలు గంగావతికి పెళ్లయిన ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. గంగావతి ప్రాణాలు విడువగా, ఇంటికి పెద్దదిక్కైన మాణిక్యాలరావు ప్రాణాపాయం మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భార్గవ్ మృతదేహం

పెనుగొండ: వడలి పిట్టల వేమవరం రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం పెనుగొండకు చెందిన తడివాడ భార్గవ్ (17) స్నేహితుడు ఇళ్ల నంద కిషోర్‌తో కలసి మోటార్‌సైకిల్‌పై వడలి పిట్టల వేమవరం రహదారిలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ టచ్ అవ్వడంతో మోటారుసైకిల్ రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్గవ్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నందకిషోర్‌కు గాయాలు కావడంతో తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పెనుగొండ ఎస్సై కే గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికి రంగులు వేస్తూ జారిపడి వ్యక్తి మృతి

భీమవరం: ఇంటికి రంగులు వేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ ఏఎస్సై బాజి బుధవారం చెప్పారు. పట్టణంలోని మారుతీ నగర్‌లో ఇళ్ల వేణుగోపాల్ ఇంటికి రంగులు వేయడానికి పట్టణంలోని గాం.దీనగర్‌కు చెందిన కురెళ్ల తాతారావు(56) వచ్చాడు. రంగులు వేస్తుండగా తాడు జారి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తాతారావు అల్లుడు జవ్వాది సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బాజి చెప్పారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో కీర్తనకు రజతం



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయిని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నగరంలోని ఏఆర్‌డీజీకే పాఠశాల విద్యార్థిని చుక్క కీర్తన రజత పతకం సాధించింది. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకూ మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కీర్తన 59 కేజీల విభాగంలో స్నాచ్‌లో 67 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 87 కిలోలు కలిపి మొత్తం 154 కిలోలు ఎత్తి రజత పతకం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీ. షారోన్ తెలిపారు. అలాగే తమ పాఠశాలకు చెందిన మొయిద పావని 40 కేజీల విభాగంలో స్నాచ్‌లో 47 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 55 కిలోలు మొత్తం 102 కిలోల బరువు ఎత్తి 4వ స్థానంలో నిలిచిందన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించి పతకాలు సాధించిన విద్యార్థినిలను, ఫిజికల్ డైరెక్టర్ పీ పుల్లారావును బుధవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ ఉపాధ్యాయులు వీ కాంతి జయకుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈడే శివశంకర రావు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి క్షేత్రం

- 11న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం
- 12న రాత్రి రథోత్సవం
- ఉత్సవ వివరాలు వెల్లడించిన ఆలయ ఈఓ మూర్తి



ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు మే 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఈ ఉత్సవాలను 14 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి బుధవారం వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా 7న ఉదయం శ్రీవారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేస్తారు. 8న అంకురార్పణ, రుత్విగ్వరణ, ధ్వజారోహణను నిర్వహిస్తారు. అలాగే 9న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై తిరువీధి సేవలు, 10న రాత్రి ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది. 11న రాత్రి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. 12న రాత్రి రథోత్సవం, 13న చక్రవారి-అవభృధోత్సవము, వేద సభ, ధ్వజావరోహణ నిర్వహిస్తారు. 14న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటల నుంచి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగము-పవళింపుసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయి. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలను నిర్వహిస్తామన్నారు. అలాగే ఆలయ ముఖ మండపంలో స్వామివారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చేనెల 7 నుంచి 14 వరకు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఈఓ కోరారు.



జంగారెడ్డిగూడెం: కాలేజ్ రోడ్డులో నేలకొరిగిన భారీ వృక్షం



బుట్టాయగూడెం : సీతప్పగూడెంలో పడిపోయిన మొక్కజొన్న పంట

ఈదురుగాలుల బీభత్సం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న పంటలు

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ప్రారంభమైన భారీ గాలులు, వర్షంతో భారీ వృక్షాలు నేలకూలాయి. కొన్ని చోట్ల వృక్షాలు ఇళ్లపై పడ్డాయి. జంగారెడ్డిగూడెం కాలేజ్ రోడ్డులో భారీ వృక్షం నేలకూలింది. పట్టణం, మండలంలో భారీ వృక్షాలు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు నేలకూలడం, విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా, విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్, డీఈ యు.సుబ్బారావుల ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులను అర్ధరాత్రి తరువాత నుంచి ప్రారంభించారు. చివరకు బుధవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో విద్యుత్ పునరుద్ధరించారు.



జంగారెడ్డిగూడెం: లక్కవరంలో విద్యుత్ వైర్లు పునరుద్ధరిస్తున్న విద్యుత్ సిబ్బంది



బుట్టాయగూడెం : కొమ్ముగూడెంలో ధ్వంసమైన అరటి చెట్లు

పంటలు నష్టపోయిన రైతులు

బుట్టాయగూడెం: గత మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు, గాలి బీభత్సంతో ఏజెన్సీ ప్రాంతంలోని పలు చోట్ల అరటితోటలు నేలకొరిగాయి. మొక్కజొన్న, పొగాకు, జీడి మామిడి పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించగా కొమ్ముగూడెం, బుట్టాయగూడెం, నిమ్మలగూడెం, తదితర గ్రామాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. సుమారు 18 ఎకరాల వరకూ మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు ఏఓ డి.ముత్యాలరావు ప్రాథమిక అంచనా వేశారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు.



జంగారెడ్డిగూడెం: వేగవరంలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



జంగారెడ్డిగూడెం: ఓ బిల్డింగ్‌పై కూలిన కొబ్బరి చెట్టు

అప్పుల బాధ తాళలేక యువకుడి ఆత్మహత్య

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో ఒక యువకుడు అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. భీమడోలుకు చెందిన తడపల ప్రశాంత్(30) ఒక హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఆ గొడవల కారణంగా మృతుడు తన భార్యతో పాటు మూడు నెలలుగా ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలోని తన బంధువు నంభూరి పెద్దిస్వేరరావు ఇంటి వద్ద నివాసం ఉంటూ, ఒక కొరియర్ సర్వీసెస్‌లో పని చేస్తున్నాడు. అయితే గతంలో భీమడోలులో బిల్డింగ్ నిర్మాణానికి, అలాగే ప్రశాంత్ తల్లి కేన్సర్ వ్యాధి వైద్యానికి అతడు అప్పులు చేశాడు. హత్య కేసులో రిమాండ్‌లో ఉన్నప్పుడు ఆ అప్పుల భారం ఇంకా అధికమైంది. దాంతో అప్పులు తీర్చే దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ప్రశాంత్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి మృతుడి భార్య అనూష నిద్రలేచి, వాంతులు చేసుకుంటున్న తన భర్త వద్దకు వెళ్లి అతడు పురుగుల మందు తాగిన విషయాన్ని తెలుసుకుంది. వెంటనే బంధువుల సహాయంతో అతడిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ ప్రశాంత్ బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య అనూష పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.


ఏలూరు ఇందిరమ్మకాలనీ వద్ద అస్థిపంజరం



విచారణ చేస్తున్న ఏలూరు రూరల్ పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని ఇందిరమ్మ కాలనీ పంటకాలువ సమీపంలో ఒక వ్యక్తి మృతదేహం అస్థిపంజరంను స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు మృతుడు వేమూరి సత్యనారాయణ (65)గా గుర్తించారు. కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో సత్యనారాయణ ఒంటరిగా ఉంటున్నాడని, అతని భార్య విజయవాడలోని కుమారుడి వద్ద ఉంటుందని చెబుతున్నారు. మద్యానికి బానిసై పంటకాలువ వద్ద పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతిచెంది సుమారు నెలరోజులు అయి ఉండవచ్చిని పోలీసులు అంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం వ్యాన్ బోల్తా



బోల్తా పడిన మద్యం లోడు వ్యాన్

పోలవరం రూరల్: మద్యం సీసాల లోడుతో వస్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తు బోల్తా పడి మద్యం సీసాలు రోడ్డుపై పడ్డాయి. రాజమహేంద్రవరం జిల్లాలోని డిపో నుంచి పోలవరం మద్యం దుకాణానికి తరలిస్తున్న వ్యాన్ కొత్తపట్టిసీమ, పాత పట్టిసీమ మధ్యలో బుధవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో తీసుకువస్తున్న సుమారు రూ.7 లక్షల విలువైన మద్యం సీసాలు నేలపాలయ్యాయి. వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మద్యం వ్యాన్ తిరగబడిన సమాచారం మద్యం షాపు యజమానికి అందడంతో హుటాహుటిన సిబ్బంది అక్కడికి చేరుకుని నేలపై పడ్డ మద్యం సీసాలను ఒబ్బిడి చేసుకున్నారు.

పొగాకు బేరన్ దగ్ధం

బుట్టాయగూడెం: కొమ్ముగూడెంలో బుధవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక పొగాకు బేరన్ దగ్ధమైంది. ఆలపాటి వెంకట రమణమూర్తి అనే రైతు పొగాకు క్యూరింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలను గ్రామస్తులు ఆర్పే ప్రయత్నం చేశారు. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్టు రైతు వెంకట రమణమూర్తి తెలిపారు.

అమ్మా, నాన్న మీరిద్దరూ ఒక్కటవ్వాలి

సూసైడ్ నోట్ రాసి కుమార్తె ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం : తన చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు కలిసి ఉండటం ఆమె చూడలేదు. కుటుంబ కలహాలతో ఆ తల్లిదండ్రులు తనకు దూరంగా ఉండటాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. తన మరణంతోనైనా తల్లిదండ్రులు కలిసి ఉండాలని ఆశపడి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జంగారెడ్డిగూడెంలో విషాదం నింపింది. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన అల్లు లేఖ్యశ్రీ (16) తనకు మూడేళ్ల వయసు నుంచే జంగారెడ్డిగూడెంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఇక్కడే చదువుకుంటూ ప్రస్తుతం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసింది. లేఖశ్రీ చిన్నప్పటి నుంచి తండ్రి రవి, తల్లి నాగదుర్గాదేవి కుటుంబ కలహాలతో రాజమండ్రిలో వేరుగా జీవిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన లేఖశ్రీ బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఆమె తన సూసైడ్ నోట్‌లో తన మరణం తరువాతనైనా తన తల్లిదండ్రులు కలిసి జీవించాలని కోరుకుంటున్నట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాబు పాలనే.. అయ్య బాబోయ్

కొయ్యలగూడెం: బాబు పాలన అంటేనే అయ్యబాబోయ్ అనే పరిస్థితి ప్రజల నోళ్లలో పునరావృతం అవుతోందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం కొయ్యలగూడెంలో ఆయన పలనాడు రైతు ప్రతినిధులను కలుసుకున్న సందర్భంగా మాట్లాడారు. పలనాడు జిల్లా రైతు ప్రతినిధులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు నల్లపాటి రామయ్య నేతృత్వంలో బాలరాజును కలుసుకుని తమ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సాధక, బాధలు గురించి వివరించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళుతూ వచ్చిన వీరు మిర్చి, పత్తి, టొబాకో రైతుల సంక్షేమ పరిస్థితి గురించి చర్చించారు. చంద్రబాబు నాయుడు పాలనలో రైతులు ఏనాడు సుభిక్షంగా లేరని ఇప్పుడు కూడా ఆయన పాలన ఎప్పుడు ముగుస్తుందా అని తమ ప్రాంత రైతులతో సహా ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. రాయలసీమలోని రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని, సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి యూరప్ పర్యటనలతో గడుపుతున్నారని విమర్శించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి అయితే కేవలం ఇంకా సినీ ఆర్టిస్టు మాదిరిగానే నటనతో జీవిస్తున్నారని అన్నారు. మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మేకల అన్నవరం, వైఎస్సార్‌సీపీ నాయకులు విగ్గిన రామకృష్ణ, చింతలపూడి కిషోర్, రాఘవరాజు సాయి కృష్ణ, చవల నాగేశ్వరరావు, చవాకులు సూరిబాబు, నారా సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో రైతు ప్రతినిధులను కలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం



చలసాని కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సమాజాన్ని చైతన్య పరిచేవి కళలేనని, వాటిలో తొలి ప్రాధాన్యం సాంఘిక నాటికలేదేనని పలువురు వక్తలు అన్నారు. కళారంజని 14వ వార్షికోత్సవ జాతీయ స్థాయి తెలుగు నాటికల పోటీలు బుధవారం రాత్రి భీమవరంలోని సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చుక్కన్నశ్రీ స్మారక పురస్కారంను నటులు, దర్శకులు, రచయిత, ప్రయోక్త వేల్పూల నాగేశ్వరరావుకు, జవ్వాది సూర్యారావు స్మారక పురస్కారంను విశాఖపట్టణంకు చెందిన చలసాని కృష్ణప్రసాద్‌కి అందజేసి వారిని దుశ్శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. ముందుగా బీవీకే కీయోషన్ కాకినాడ వారి తితిక్ష నాటికను ప్రదర్శించి, అనంతరం సత్కార కార్యక్రమం నిర్వహించారు. రెండవ నాటికగా శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్ విజయవాడ వారి అపస్వరం నాటికలను ప్రదర్శించారు. ఈ నాటికలో నటించిన కళాకారులు వారి హావభావాలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో బుద్దాల వెంకట రామారావు, రాయప్రోలు భగవాన్, జవ్వాది దాశరథి శ్రీనివాస్, నల్లం వెంకట కృష్ణారావు, గుండా రామకృష్ణ, మల్లుల సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి



అత్తిలి మండలం ఆరవల్లిలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ

అత్తిలి: బిడ్డకు ఆరునెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని తణుకు ఐసీడీఎస్ సీడీపీఓ ప్రమోదకుమారి చెప్పారు. పోషణ పక్వాడాలో భాగంగా బుధవారం అత్తిలి మండలం ఆరవల్లి అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు జరిపారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, మునగాకు ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో మంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సూసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా సీతారాం



వద్దూరి సీతారాం

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో భాగంగా తణుకుకు చెందిన సీనియర్ నాయకులు వద్దూరి సాయి సీతారామకృష్ణ (సీతారాం)ను పార్టీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతోపాటు నియోజకవర్గ పార్టీ శ్రేణులు సీతారాంకు అభినందనలు తెలిపారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సీఐటీయూ మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఏళ్ల తరబడి సేవలు అందించి, మరణించిన వారికి, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొడమంచిలి బాబు, తాడికొండ జయరాం, అల్లం పూర్ణిమ, తాడికొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ సెంటర్ ప్రారంభం



సెంటర్ ప్రారంభంలో పాల్గొన్న అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రూ. 18 లక్షలతో కొత్తగా కట్టిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులు ప్రారంభించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ, స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ టీకాలను ఈ సెంటర్‌లో వేస్తారు. సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్, ప్రొటెక్షన్ ఏజెన్సీ వైద్యులు, సిబ్బంది ఈ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు. నాలుగు వీధి కుక్కలకు ఆపరేషన్లు చేశారు. ప్రస్తుతం అవి కోలుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఎం.ఏసుబాబు, పోలీస్ అధికారులు, వెటర్నరీ డీడీ సుధాకర్, ఎంఈ వెంకట రమణ, శానిటరీ ఇనస్పెక్టర్లు, ఎంహెచ్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా ప్రతిమాంబసమేత సదాశివ స్వామి ఆలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆలయానికి ఇప్పటికే పలువురు విరాళాలు అందజేశారు. బుధవారం తాడేపల్లి గూడెంకు చెందిన ప్రముఖులు గొడితి జన్నయ్య జ్ఞాపకార్థం వారి సతీమణి సుందరమ్మ, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయనిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ వీర్లకృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కాలుష్య కోరల్లో గోస్తనీ కాలువ

- నీలిరంగులోకి మారిన నీరు
- ఆందోళనలో ప్రజలు
- కర్మాగారాల నుంచి రసాయనాలు వదిలారంటూ వదంతులు
- కాలువలోకి దిగాలంటే భయపడుతున్న ప్రజానీకం



నీలి రంగులోకి మారిన గోస్తనీ కాలువ నీరు



బకెట్‌లో కనిపిస్తున్న నీలి రంగు నీరు

తణుకు అర్బన్: గోస్తనీ కాలువలోని నీటి ప్రవాహంలో నీరు నీలి రంగులోకి మారడంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. మంగళవారం ఉదయం నుంచి తణుకు గోస్తనీ కాలువ నీరు నీలి రంగులో ప్రవహిస్తుంది. దీంతో కాలువ నీటిని ఉపయోగించుకునే ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. తణుకులోని పలు కర్మాగారాల నుంచి ఏమైనా రసాయనాలు విడుదల చేశారా అనే ఆందోళనలో ప్రజానీకం ఉన్నారు. ముఖ్యంగా రజకవృత్తిదారులు ఈ నీటిలో దిగితే ఏమవుతుందోనని భయాందోళన చెందుతున్నారు. తణుకు నుంచి వీరభద్రపురం అత్తిలి వరకు ఇదే రకంగా నీరు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గోస్తనీ నదిగా పేరు

తణుకు ప్రాంతంలో ప్రవహిస్తున్న కాలువకు గతం నుంచి గోస్తనీ నదిగా పేరు ఉంది. అయితే కొన్ని దశాబ్దాల క్రితం ఈ గోస్తనీ నదికి ఎంతో విశిష్టత ఉండడంతో అప్పట్లో ఈ కాలువ నీటిని తాగడానికి ఉపయోగించేవారు. కాలక్రమేణా గోస్తనీ కాలువ మురికి కూపంగా మారిపోవడంతో ప్రజలు స్నానాలు చేసేందుకు భయపడుతున్నారు. తణుకు పురపాలక సంఘ పరిధిలోని డ్రెయినేజీ వ్యవస్థకు సంబంధించి అవుట్‌లెట్ అంతా ఈ గోస్తనీ కాలువలోకి మళ్లించడంతో ఈ కాలువ మరింత మురికినీటితో నిండిపోయింది. తణుకు పట్టణంతో పాటు గ్రామాల్లో ఉన్న పలు కర్మాగారాల నుంచి వచ్చే వ్యర్థాలు ఈ గోస్తనీ కాలువలోకి విడిచిపెడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మంగళవారం ఉదయం నుంచి ఒక్కసారిగా ఆకుపచ్చగా ప్రవహించే నీరు నీలి రంగులోకి మారడంతో సోషల్ మీడియాలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌ను సాక్షి వివరణ కోరగా గోస్తనీ కాలువ నీలి రంగులో రంగులో ఉండడం ఇబ్బందికరమైన విషయం కాదని, నాచు తదితర కారణాలతో ఇలా జరుగుతుందన్నారు. కాలువలో నీటి రంగు నలుపుగా కనిపిస్తేనే భయపడాలని ఎటువంటి ఇబ్బందులు రావని అన్నారు.

ఆర్టీసీ డిపోలో చలివేంద్రం ఏర్పాటు



డిపోలో చలివేంద్రం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ డిపోలో వేసవి దాహార్తులు కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చల్లని నీటిని ప్రయాణీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సత్యసాయి సేవా సమితిచే డిపోలో చలివేంద్రం ఏర్పాటు చేయడం, ఎండలు తగ్గే వరకు చల్లటి మంచినీటిని అందజేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, తిరుములశెట్టి శోభనాద్రిరావు, నవీన్‌బాబా, ప్రవా శ్రీనివాస్, జంధ్యాల నాగేశ్వరరావు, పద్మావతి, రాఘవలు పాల్గొన్నారు.

కచ్చితమైన ఫలితాలు అందజేయాలి

కలెక్టర్ నాగరాణి



పెదతాడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం: పరిశోధనాశాలల్లో శాస్త్రవేత్తలు కచ్చితమైన ఫలితాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. పట్టణంలోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ల్యాబ్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే ఫలితాలలో ల్యాబ్‌కు మంచి పేరును తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం నాణ్యమైన ఎరువులను పరిశీలించి ఫలితాలను రైతులకు అందుబాటులోకి తేవడానికి నూతన పరికరాలను అందించిందని ఆమె అన్నారు. ఈ ల్యాబ్‌లో జీఎల్ఎస్ విశ్లేషణ బాగావస్తుందనే పేరు ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం ఎరువులు, విత్తనాలను నమూనాలను సేకరించి గూడెం, అమరావతి, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతీయ కోడింగ్ సెంటర్లకు పంపిస్తామని, అక్కడ నుంచి బాపట్ల, తాడేపల్లిగూడెం, అనంతపురం ప్రయోగశాలలకు పంపించి డీ కోడింగ్ చేసి సెంటర్‌లకు పంపిస్తామని సైంటిస్టులు కలెక్టర్‌కు చెప్పారు. ప్రయోగఫలితాల్లో కేసులు నమోదు చేస్తామన్నారు. గూడెం సెంటర్‌లో నిర్వహించిన పరీక్షా ఫలితాలకు సంబంధించి101 కేసులను రిఫర్ చేశామని చెప్పారు. ఈ ప్రయోగశాలలో ఇప్పటి వరకు మూడు వేల ఎరువుల నమూనాలు, రెండువేల పురుగుల మందుల నమూనాలను తనిఖీ చేసి నివేదికలను అందజేశామన్నారు. ఈ ప్రయోగశాలలో 21 లక్షలతో ఏర్పాటుచేసిన ఆటోమిక్ అబ్జార్షన్ స్పెక్ట్రో మీటర్ , గ్యాస్ లిక్విడ్ చోరోమెటోగ్రఫీ మిషనరీలను ఆమె ప్రారంభించారు. ఆమె వెంట వ్యవసాయ జిల్లా సంచాలకులు జడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ జె.శశి బిందు, డిడి.శ్రీనివాసు, ఏఓలు వై. ఇందిరాఝాన్సీ, ఏడీఏ మురళీకృష్ణలు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం అమ్మాలి: కలెక్టర్

రైతు సేవాకేంద్రాల ద్వారా రైతులు ధాన్యం అమ్మాలని కలెక్టర్ నాగరాణి కోరారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోనె సంచుల సరఫరాపై ఆరా తీశారు. ఏ రకాలను సాగు చేశారు. ఎంత దిగుబడి వచ్చిందనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

పార్టీ శ్రేణులను కలిసిన మాజీ మంత్రి కారుమూరి



తణుకులో మైనర్‌బాబు తండ్రి వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అనారోగ్యంతో తణుకు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన మైనర్‌బాబు తండ్రి వెంకటేశ్వరరావును మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు ఆరోగ్యస్థితిపై ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ గుడ్ల సతీష్‌ను ఆరా తీశారు.

నూతన జంటలను ఆశీర్వదించిన కారుమూరి..

ఇటీవల వివాహాలు జరిగిన తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన పార్టీ నాయకులు కందుల పోతురాజు బావమరిది కటికిరెడ్డి వెంకటకృష్ణతోపాటు కడియం ధనరాజు కుమారుడు గణపతిలను కారుమూరి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డాబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు శిరిగిశెట్టి గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ కడియం వీరబాబు, దండు కృష్ణంరాజు, ఎంపీటీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకు నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

తణుకు అర్బన్: మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి తెలిపారు. తణుకు జాతీయ రహదారి సమీపంలోని సీఎం కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3.00లకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, పీఏసీ సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, ఉంగుటూరు ఇన్‌చార్జ్ పుప్పాల వాసుబాబు, ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్, చినమిల్లి రాయుడు పాల్గొంటారన్నారు.

దాతల ఔదార్యం అభినందనీయం



తణుకులో విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న మానవత ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న చలివేంద్రానికి సహకరిస్తున్న దాతల ఔదార్యం అభినందనీయమని మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. తణుకు వేల్పూరు రోడ్డులో చలివేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చలివేంద్రం నిర్వహణకు తణుకుకు చెందిన దాత గోకవరపు కాశీవిశ్వేశ్వరరావు రూ. 10వేలు అందజేసినందుకు సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. చలివేంద్రం ప్రారంభానికి ముందే పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత రూ. 10వేలు అందించారని చెప్పారు. దాతల సహకారంతో ఈ చలివేంద్రం నిరవధికంగా కొనసాగుతుందని, మేనెల అంతా చలివేంద్రం ద్వారా ప్రయాణికుల దాహార్తిని తీర్చనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వరరావును మానవత తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, చిట్టూరి సుజాత, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కె.రామలక్ష్మి, జిల్లా కన్వీనర్ ఎస్ వి సతీష్ బాబు, కార్యదర్శి బొల్లం రామ కాశి, కోశాధికారి అక్కిన కాశీ విశ్వనాథం, తణుకు సంస్థ పూర్వ అధ్యక్షుడు వంగూరి హనుమంతరావు, ఆలపాటి సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న గృహిణి, ఫైర్ అధికారి, సిబ్బంది



అత్తిలిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ఆఫీసర్ కె గంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో బుధవారం మూడోవ రోజు సత్యవతినగర్‌లోని ఎస్.ఎస్.రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన, మాక్‌డ్రిల్ జరిగింది. అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంట్లో ఉండే పదార్థాలతోను, బకెట్, తడి దుప్పటి వంటి వాటితో అగ్ని ప్రమాదాన్ని ఏ విధంగా నివారించవచ్చో మహిళలకు మాక్ డ్రిల్ చేయించారు. పట్టణంలో ర్యాలీ జరిగింది. కరపత్రాలను పంపిణీ చేశారు. రామారావు మాట్లాడుతూ ప్రజలందరూ అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌లు సంభవిస్తాయి

అత్తిలి: గృహాలలో ఒకే ప్లగ్‌పై పలు విద్యుత్ కనెక్షన్‌లు వినియోగించడం వల్ల ఓవర్‌లోడై విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు సంభవిస్తాయని అత్తిలి అగ్నిమాపక కేంద్ర అధికారి కొవ్వాసు గంగరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం అత్తిలి అగ్నిమాపక సిబ్బంది అపార్టుమెంట్లు, నివాస గృహ సముదాయాల వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అత్తిలి శ్రీలక్ష్మీరెసిడెన్సీ నిలయం వద్ద మహిళలకు ఎలక్ట్రికల్ ప్యానెల్‌బోర్డు, జనరేటర్‌లో జరిగే ప్రమాదాలను వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ లీకైన సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

తణుకు అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తణుకులో అగ్నిమాపక సిబ్బంది బుధవారం పట్టణంలోని సజ్జాపురం శివాలయం వీధిలోని దాసం అపార్టుమెంట్‌లో ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహాల్లో గ్యాస్ సిలిండర్ల నుంచి మంటలు చెలరేగినప్పుడు ఏవిధంగా ప్రమాదాన్ని నివారించాలో ప్రయోగాత్మకంగా చూపించారు. అపార్టుమెంట్‌లో ప్రజానీకం అవగాహన కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితులు, క్రైస్తవులపై దాడులు దారుణం



పట్టణంలో నిరసన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళితులపైన, క్రైస్తవుల పైన దాడులు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు ఖండించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చీకటమిల్లి మంగరాజు కోరారు. దాడులకు నిరసన వ్యక్తం చేస్తు పట్టణంలో బుధవారం మాల మహానాడు, క్రైస్తవ సంఘాలు ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంగరాజు మాట్లాడుతూ భీమడోలు మండలం పొలసానిపల్లి గ్రామంలో ఇంకా ప్రారంభం కాని అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండలు వేయడాన్ని ఖండించారు. చెప్పుల దండ వేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పవీణ్ మరణంపై చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. సీబీఐ ఎంక్వైయిరీ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దానియేలు రాజు, డల్లా, జైపాల్, సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

తణుకు అర్బన్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ మంచి విద్యాభ్యాసన చేసేందుకు విద్యార్థులు పాటుపడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం తణుకు పట్టణంలో సాంఘిక సంక్షేమ ప్రభుత్వ కళాశాల 1,2 బాలురు, బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించి పూర్తిస్థాయిలో పనులు చేయాలని, మరమ్మతుల కోసం అవసరమైతే మరిన్ని ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధనపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బీవీఎస్‌బీ రామాంజనేయరాజు, తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ అశోక్ వర్మ, ఫణి కుమార్, రామకృష్ణ, వై.అరుణ పాల్గొన్నారు.

తణుకులో పింక్ టాయిలెట్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన..

మహిళల ప్రత్యేక అవసరాల కోసం తణుకు పట్టణంలో పింక్ టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. బుధవారం తణుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తహసిల్దార్ కార్యాలయ ప్రాంతాల్లో పింక్ టాయిలెట్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తహసీల్దార్ డీవీఎస్ అశోక్ వర్మ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్ తదితరులు ఉన్నారు.

శిశువులకు తల్లిపాలే మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): శిశువులకు తల్లిపాలతోనే పౌష్టికాహారం లభిస్తోందని పలువురు వక్తలు తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో వీకర్స్‌కాలనీ నాన్న కళ్యాణ మండపంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ స్థాయిలో పోషణ్ పక్వాడ్, బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పలు సూచనలు చేశారు. వక్తలు ఐసీడీఎస్ సీడీపీఓ ఎల్.సరస్వతి, గోయంక కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరామ్, సూపర్‌వైజర్లు దుర్గా భావాని, విశాలాక్షి, ఎస్తేరు రాణి, విజయలక్ష్మి, సుజాత, శ్రీదేవి, బేబీలు మాట్లాడుతూ ఆడ పిల్లలను తప్పక చదివించాలన్నారు. మంచి భవిష్యత్తును అందజేయాలని తెలిపారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయరాదన్నారు. వ్యాసరచన పోటీలు, వకృత పోటీల్లో విజేతలకు, ఇంటర్‌లో మెరిట్ స్టూడెంట్‌లకు జ్ఞాపికలు, సర్టిఫికెట్స్ అందజేశారు. మహిళా పోలీస్, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



గురుకులంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైర్ (ఆర్వో) ప్లాంట్‌ను బుధవారం యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ నాంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఏలూరు యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం వారు బాలుర వసతి గృహానికి ఈ ఆర్వో ప్లాంట్‌ను బహూకరించినట్లు ప్రిన్సిపల్ బీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకు పథకాలపై గురుకులం ఉద్యోగులు, సిబ్బందికి యూబీఐ ఆర్ఎం శ్రీనివాసరావు వివరించారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేసిన బ్యాంకు అధికారులకు ప్రిన్సిపాల్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

అత్తపై కోడలు దాడి..కేసు నమోదు

అత్తిలి: మండలంలోని కొమ్మర గ్రామంలో అత్త మంతెన సత్యవతిపై దాడిచేసిన కోడలు పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. అత్త సత్యవతి భర్త మరణానంతరం కుమార్తెతో కలిసి భీమవరంలో ఉంటోందని, ఈనెల 7న అత్త సత్యవతి కొమ్మర రాగా, కోడలు పద్మ ఎందుకు వచ్చావని దూషిస్తూ, కుమార్తె ఇంటికి పోవాలంటూ చేతులతో కొట్టి, చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం రూ. 38 లక్షల వ్యయంతో 98 మంది రైతులకు పవర్‌టిల్లర్‌లు, రోటోవేటర్లు, బ్యాటరీస్ప్రెయర్లు, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడీ జెడ్ వెంకటేశ్వర్లు, టీబీఆర్ బోగేశ్వరరావు, కొలనువాడ పెదకృష్ణంరాజు, సర్పంచ్ తాతపూడి ప్రగతి, ఎంపీటీసీ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు.